

గంజాయి సాగుపై దాడులు

రాయగడలో గంజాయి సాగుపై దాడులు జరుగుతున్నాయి. 3వేల గంజాయి మొక్కలు ధ్వంసం చేశారు.

- 8లో

మారిన మందుల చీటీ

జయపురం: కొరాపుట్ జిల్లా కేంద్రాస్పత్రి జయపురంలో ఒక రోగికి ఇవ్వాల్సిన ఇంజెక్షన్ మరో రోగికి ఇచ్చారని ఆ రోగి బంధువులు ఆరోపించారు. ఆస్పత్రి అధికారులకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ దిలీప్ బిశ్వాల్, హాస్పిటల్ మేనేజర్ శ్రీమతి రూపసి నాయిక్ తదాగత శతపతి తదితరులు దర్యాప్తు జరిపారు. రోగికి ఇంజెక్షన్ మారలేదని అతడి ప్రిస్క్రిప్షన్ మాత్రమే మారిందని కమిటీ వెల్లడించింది. మంగళవారం కుని సాహు పేరుగల ఒక రోగి చికిత్స కోసం హాస్పిటల్‌కు వచ్చాడు. అతడు ఒక డాక్టర్ వద్ద వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. డాక్టర్ అతడికి ప్రిస్క్రిప్షన్ లో గ్యాస్టిక్ ఇంజెక్షన్ రాసి తీసుకోమని తెలిపారు. అయితే అతడి ప్రిస్క్రిప్షన్ ఎలాగో మారిపోయింది. కుని సాహు ఇంజెక్షన్ తీసుకునే సమయంలో పొరపాటు బయట పడింది. అతడికి ఇవ్వాల్సిన ఇంజెక్షన్ మరె వరికో ఇచ్చినట్లు వెల్లడైంది. ఈ సంఘటన వైద్యాధికారుల్లో చర్చనీయాంశమైంది. ఇలాంటి పొరపాట్లు రోగి జీవితాలతో చెలగాటమేనని ప్రజలు విమర్శిస్తున్నారు.

న్యూస్‌రీల్

పేకాట రాయుళ్ల అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

మల్కన్‌గిరి: జిల్లాలో బలిమెల ప్రాంతంలోని పలు ప్రదేశాల్లో జరుగుతున్న పేకాట శిబిరాలపై బలిమెల ఐఐసీ దీరాజ్ పట్నాయిక్ ఆదేశాలతో సిబ్బంది దాడి చేశారు. దీనిలో భాగంగా మొత్తం 26 మందిని బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.27,080 నగదు, పేక ముక్కలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అందరినీ కోర్టుకు తరలిస్తామని ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ తెలిపారు.

24 లీటర్ల విదేశీ మద్యం పట్టివేత



పోడియా పోలీసులు అరెస్టు చేసిన నిందితుడితో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా పోడియ సమితి ధర్మపల్లి గ్రామం వద్ద మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోడియా పోలీసులకు టేకాలగూడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 24 లీటర్ల విదేశీ మద్యం దొరికింది. అతడు నిలిగూడ వైపు వెళ్తున్నారు. పోలీసులు తనిఖీ చేయగా 40 బీర్ సీసాలు దొరికాయి. అతడిని అరెస్టు చేసి పోడియా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. మొత్తం 24 లీటర్ల మద్యం ఉందని పోడియా ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్ తెలిపారు.

ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: సదరు సమితి చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల బాకురుగుడ వద్ద మంగళవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో ఎలక్ట్రికల్ స్కూటీకి నిప్పంటుకుని కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కానీ అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జేకేపూర్‌లో గల గౌరీ శంకర్ అనే వ్యక్తి తన ఎలక్ట్రికల్ స్కూటీపై రాయగడకు వచ్చాడు. తన పనులు ముగించుకుని రాత్రి ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో బాకురుగుడ వద్ద స్కూటీ వెనుక నుంచి దట్టమైన పొగ రావడంతో వెనుక వస్తున్న మరో వాహనదారుడు హెచ్చరించాడు. స్కూటీ ఆపి దిగిన వెంటనే స్కూటీకి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కములు నాయక్ మృతదేహం

కొరాపుట్: విద్యుత్ వైరు తగిలి వ్యక్తి మృతి చెందాడు. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి నిశ్నాహండి గ్రామ పంచాయతీ బనీయా గ్రామానికి చెందిన రైతు కములు నాయక్ (45) బుధవారం ఉదయం తన పొలానికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లాడు. అదేమార్గంలో 11కేవీ విద్యుత్ వైరు తెగిపడి ఉంది. ఆ విషయం గమనించక వెళ్లిన కములు నాయక్‌కు విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన ఇతర రైతులు జాగ్రత్తపడి ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. వెంటనే విద్యుత్, అగ్నిమాపక, పోలీసు విభాగాలకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో పలుమార్లు ఈ మార్గంలో విద్యుత్ వైరు తెగిపోతోందని విద్యుత్ శాఖకి సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా.. వన్యప్రాణి వారోత్సవాలు



పర్లాకిమిడి: దేవగిరి రేంజ్ అధికారులతో పర్లాకిమిడిలో ర్యాలీ



పర్లాకిమిడి: చంద్రగిరి రేంజ్ పుడామర్రి అటవీ రేంజ్‌లో విద్యార్థుల ర్యాలీ

పర్లాకిమిడి: వన్య ప్రాణి వారోత్సవాలను గజపతి జిల్లా వ్యాప్తంగా ఏడు అటవీ రేంజ్ అధికారులు ఘనంగా బుధవారం నిర్వహించారు. ప్యాలెస్ వద్ద వన్యప్రాణుల సంరక్షణ అవగాహన ర్యాలీని కలెక్టర్ మధుమిత ప్రారంభించారు. పర్లాకిమిడిలో దేవగిరి రేంజ్ అధికారి బ్రహ్మానంద సాహు, డి.వెంకట రమణ, ప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో రాజవీధి ప్యాలెస్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహారాజా బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చంద్రగిరి రేంజ్‌లో జిల్లా ముఖ్య అటవీశాఖ అధికారి కె.నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనుషులు, వన్యప్రాణులు కలిసి జీవించటం, వారి సంరక్షణపై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. లేకుంటే బయో డైవర్సిటీ లోపిస్తుందని తెలిపారు. అనంతరం వన్యప్రాణులు, మనుషులు కలిసి మనుగడపై డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు డీఎఫ్ఓ కె.నాగరాజు, ఏసీఎఫ్ షైని శ్రీదాస్‌లు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనంతరాం కర్, చంద్రగిరి పద్మపురం పంచాయతీ సర్పంచ్ సింహాచల ప్రధాన్, ఏసీఎఫ్ షైనీశ్రీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

71వ వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి రేంజ్ కార్యాలయంలో బుధవారం 71వ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా పాములు, తాబేళ్ల రక్షణపై అవగాహన కల్పించారు. పాములు పట్టేవారికి సిబ్బంది, విద్యార్థులు రాఖీలు కట్టారు. అలాగే వన్యప్రాణి సంరక్షణపై ప్రమాణం చేశారు. పాములు కనిపిస్తే చంపకుండా స్నేక్ హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



పర్లాకిమిడి: పర్లాకిమిడిలో విద్యార్థుల ర్యాలీలో ఫారెస్టర్ డి.వెంకటరమణ



మల్కన్‌గిరి : ప్రమాణం చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు



మల్కన్‌గిరి :చిత్రలేఖనంలో విజేతకు బాహుమతి అందజేస్తున్న అటవీశాఖ అధికారులు



మల్కన్‌గిరి : పాముల రాఖీలు



పర్లాకిమిడి: చంద్రగిరి పద్మపూర్ గ్రామపంచాయతీలో వన్యప్రాణుల సంరక్షణపై మాట్లాడుతున్న డీఎఫ్ఓ కె.నాగరాజు

అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నేడు

- రాయగడ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం
- ఓటింగ్‌పై సర్వత్రా ఆసక్తి
- తీర్మానానికి వ్యతిరేకంగా బీజేడీ విప్ జారీ



BJD
BIJU JANATA DAL
WHIP
(NAVEEN PATNAIK)
President
Biju Janata Dal, Odisha
President
BIJU JANATA DAL

జారీ చేసిన విప్



కలెక్టర్ కులకర్ణికి విప్ పత్రాన్ని సమర్పిస్తున్న జగన్నాథ సరక



శుభ్ర పండ (ఫైల్)

రాయగడ: రాయగడ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, న్యాయవాది శుభ్రపండపై 19 మంది కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి గురువారం ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో ఓటింగ్‌కు రంగం సిద్ధమయ్యింది. పట్టణాభివృద్ధికి సంబంధించి వైస్ చైర్‌పర్సన్ పండ తమకు ఎటువంటి విధంగా సహకరించడం లేదని ఆరోపిస్తు 19 మంది కౌన్సిలర్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఒక వినతిపత్రంను కూడా సమర్పించారు. దీనిపై 19 మంది కౌన్సిలర్ల సంతకాల సేకరణ, పరిశీలనకు సంబంధించి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్‌కు కలెక్టర్ ఆదేశించారు. పరిశీలన ప్రక్రియను పూర్తి చేసిన ఆయన సంబంధిత నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో కలెక్టర్ ఈనెల 9వ తేదీన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి తేదీని ఖరారు చేశారు.

ఇదీ విషయం

రాయగడ మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉండగా, గత మున్సిపల్ ఎన్నికల్లో అధికారంలో ఉన్న బీజేడీ 21 మంది కౌన్సిలర్లను గెలిపించుకుంది. బీజేడీ అండదండలతో గెలుపొందిన శుభ్రపండ అనంతరం అందరి సహకారంతో వైస్ చైర్‌పర్సన్ పదవి దక్కించుకున్నారు. అయితే ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలకు సంబంధించి బీజేడీలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో పాటు పార్టీ నాయకుల్లో విభేదాలు బహిర్గతమవ్వడంతో ఆ పార్టీకి నెక్కంటి భాస్కరరావు గుడ్ బై చెప్పారు. ఆయన అండతో గెలిచిన శుభ్ర పండ అతనిని విభేదించి బీజేడీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జగన్నాథ సరక, సీనియర్ నాయకుడు సుధీర్ దాస్‌లతో చేతులు కలిపారు. దీతో శుభ్రపండను గద్దె దించాలని వ్యూహం పన్నిన నెక్కంటి ప్రయత్నమే ఈ అవిశ్వాస తీర్మానానికి కారణమని రాజకీయ నాయకుల అభిప్రాయం. అయితే శుభ్రపండకు అనుకూలంగా ఎంతమంది నిలుస్తారో వేచి చూడాల్సిందే. అత్యధిక శాతం మంది కౌన్సిలర్లు ఆమెను వ్యతిరేకిస్తుండడంతో ఆమె వైస్ చైర్‌పర్సన్ పదవి హుళక్కేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటింగ్‌పై విప్ జారీ

అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌కు సంబంధించి బీజేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం విప్ జారీ చేశారు. మున్సిపాలిటీలోని 19 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై జరగనున్న ఓటింగ్‌లో పాల్గొని తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జగన్నాథ సరక విప్ నకలను కలెక్టర్ అశుతోష్ కులకర్ణికి బుధవారం సమర్పించారు. విప్ జారీ చేసిన నేపథ్యంలో కౌన్సిలర్లు ఉత్తర్వులకు వ్యతిరేకంగా పనిచేస్తే వారిపై పార్టీపరమనైన క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ఘనంగా దసరా వేడుకలు



దేవీ పీఠం వద్ద పూజలు అందుకున్న దేవతాలాఠీలు

జయపురం: సంప్రదాయ దసరా ఉత్సవాలు ముగిశాయి. అయితే జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి అసన గ్రామ పంచాయతీ ఉదలగుడ గ్రామ ప్రజలు సోమవారం దసరా వేడుకలను జరుపుకున్నారు. వీరు సాధారణ దసరా ముగిసిన నాలుగు రోజుల తర్వాత దసరా వేడుకలు చేసుకోవడం సంప్రదాయం. 1970 నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోందని స్థానికులు తెలిపారు. సోమవారం స్వర్గీయ పితాంబర దాస్ ఇంటిలో మా దుర్గాకు పూజలు జరిపిన తర్వాత గ్రామ దేవత గుడి నుంచి అంచమాల తీసుకు వచ్చి మా దుర్గా దేవిని ఊరేగిస్తూ దేవతామండపం వరకు తీసుకువచ్చారు. ఉత్సవాలలో కరిమెటి,ఫూల్‌భట్ట పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్ద సంబుద నాయిక్, మాధవ టక్రి, ఉర్దవ మరిఖ, ఘాసి జాని, ఆడు మహోరియ, సన సాగరియ, సామ పూజారి, పండు దురువ, మాదవ బారిక్, రామ చంద్ర రౌత్ అర్జున పూజారి, పరమానంద పూజారి, సహదేవ్ పూజారి తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

బంగారం దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటల్లో బంగారం దుకాణం



దగ్ధమైన దుకాణం లోపలి భాగం

రాయగడ: జిల్లాలోని మునిగుడ మెయిన్ రోడ్డు వద్దనున్న ప్రియాంక బంగారు దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే దుకాణంలోని ఫర్నీచర్ తదితర వస్తువులు మంటలకు ఆహుతయ్యాయి. దుకాణం యజమాని కుమార పొర్ణమికి దుకాణాన్ని కొత్తగా ప్రారంభించేందుకు ఇంటీరియర్ డెకరేషన్ పనులు చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు. అయితే ఇంతలోనే ప్రమాదం చోటు చేసుకోవడంతో లబోదిబోమంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా దుకాణంలో బంగారు నగలకు ఎటువంటి నష్టం సంభవించలేదని సమాచారం.

పత్తి రైతుల కోసం చైతన్య రథం



పత్తి రైతుల కోసం ప్రచార రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: భారతీయ పత్తి నిగం లిమిటెడ్, ప్రాంతీయ మార్కెటింగ్ నియంత్రణ బజార్ కమిటీ పర్లాకిమిడి ఆధ్వర్యంలో 'పత్తి రైతుల' చైతన్య రథాన్ని కలెక్టర్ మధుమిత బుధవారం ఉదయం ఆమె నివాసం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో తొలిసారిగా పత్తి రైతుల కోసం ఈ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతులకు గిట్టుబాటు ధర, పత్తి పంట కొనుగోళ్లకు యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ లేదా ఆపిల్ ఐ.ఓ.యస్.సిస్టంలో డౌన్ లోడ్ చేసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. పత్తి రైతులు తమ పేర్లు యాప్‌లో నమోదుకు వారి ఆధార్ కార్డు, భూపట్టా, ఫొటో, పత్తి రైతుల రికార్డులు అప్‌లోడ్ చేసుకోవాలని జిల్లా ఆర్ఎంసీ కార్యదర్శి రేవతీ మోహన్ రౌళో అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి ఎం.ప్రకాశరావు, ఇతర ఆర్.యం.సి. సిబ్బంది పాల్గొన్నారు.

పిత్తాబాసు పండాకు నివాళులు



మల్కన్‌గిరి : పిత్తాబాసు పండాకు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా న్యాయవాది సంఘ సభ్యులు బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో పిత్తాబాసు పండాకు నివాళులర్పించారు. సోమవారం రాత్రి బరంపురంలో సీనియర్ న్యాయవాది, బీజేపీ నాయకుడు పిత్తాబాసు పండా హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆయన మృతి తీరని లోటని సభ్యుడు గోవింద పాత్రో అన్నారు. హంతకులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. పిత్తాబాసు పండా కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలన్నారు.

బాసోసియేషన్ 'పెన్‌డౌన్'

పర్లాకిమిడి: బరంపురంలో సీనియర్ న్యాయవాది, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు, బీజేపీ ప్రతినిధి పిత్తాబాసు పండాను కాల్చి చంపిన ఘటనను పర్లాకిమిడి బార్ అసోసియేషన్ అధ్యక్షులు జితేంద్ర పట్నాయిక్ ఖండించారు. ఒడిశా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా సెషన్స్ జడ్జికోర్టులో 'పెన్ డౌన్' నిరసన చేపట్టారు. కోర్టు ప్రాంగణంలో బార్ రూమ్‌లో సంతాప సభ నిర్వహించారు. పర్లాకిమిడి బార్ అసోసియేషన్ అధ్యక్షులు జితేంద్ర పట్నాయిక్ మాట్లాడుతూ, సీనియర్ న్యాయవాది పిత్తాబసు పండా హత్యపై పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను శిక్షించాలన్నారు. పిత్తాబాసు కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తదనంతరం బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.పృథ్వీరాజ్ మాట్లాడుతూ, పిత్తాబాసు పండాను అమానుషంగా హత్య చేశారని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, భవిష్యత్‌లో న్యాయవాదులపై ఇలాంటి ఆక్రమణలు జరగకుండా 'అడ్వకేటు ప్రొటెక్షన్ బిల్'ను సుప్రీం కోర్టు అమలు చేయాలని కోరారు. సభలో పలువురు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆర్.బాబురావు, వీఎస్ఎన్ రాజు, ప్రభుత్వ పీపీ ఆర్.జనార్ధన రావు, జాయింట్ సెక్రటరీ ఎస్ఎస్ పట్నాయిక్ పంటల ప్రసాద రావు తదితరులు నివాళులర్పించారు.

కొరాపుట్: బరంపురంలో న్యాయవాది హత్యపై స్థానిక లాయర్లు బుధవారం ఆందోళన నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కోర్టుల సముదాయంలో కార్యక్రమం జరిగింది. ఆర్టీఐపై సమాచారం కోరినందుకు ఈ హత్య జరిగిందని ఆరోపించారు.



న్యాయవాది పిత్తాబాసు పండా హత్యను ఖండిస్తూ సంతాప సభలో మౌనం పాటిస్తున్న పర్లాకిమిడి బార్ అసోసియేషన్



పిత్తాబాసు పండా మరణంపై మాట్లాడుతున్న పర్లాకిమిడి బార్ అధ్యక్షుడు జితేంద్ర పట్నాయిక్



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో కోర్టుల ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది నర్సింగ త్రిపాఠి

రాజ్‌పుట్‌లో ఇక్రిసాట్ బృందం పర్యటన



రెబీ హరవోకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

కొరాపుట్: రాజ్‌పుట్‌లో ఇక్రిసాట్ బృందం బుధవారం పర్యటించింది. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి రాజ్‌పుట్‌లో గిరిజన మహిళలు నిర్వహిస్తున్న మిల్లెట్ మిషన్‌ను ఈ బృందం సందర్శించింది. ఇక్రిసాట్‌లో గ్లోబల్ రీసెర్చ్ ప్రాజెక్ట్ డైరక్టర్ (ఆర్ఎఫ్ఎఫ్ఎస్) డాక్టర్ రెబీ హరవో (ఆఫ్రికా), ఇక్రిసాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ గజానన్‌సావర్ గవనకర్ లు ఈ పర్యటనలో పాల్గొన్నారు. వీరి రాక సందర్భంగా గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ మిషన్ ద్వారా దాదాపు ఆరువేల మందికి పౌష్టికాహారం అందుతోందని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పిత్తాగుడలో పుట్టగొడుగుల పెంపక కేంద్రం పరిశీలించారు.



స్వయం సహాయక బృందం మహిళలతో రెబీ హరవో

క్లుప్తంగా

కొండపై మృతదేహం లభ్యం



పారయ్య (ఫైల్)

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి గొగుడపాడు పంచాయతీ సికిల గ్రామ సమీపంలో గల కొండపై మృతదేహాన్ని పోలీసులు మంగళవారం సాయంత్రం గుర్తించారు. మృతుడు విజయనగరం జిల్లా ఒందురుబంగి తాడికొండ ప్రాంతానికి చెందిన పువ్వల పారయ్య (38)గా (ఆధార్ కార్డు ఆధారంగా) గుర్తించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కొండపై స్వాధీనం చేసుకున్న మృతదేహం ముఖంపై తుపాకితో కాల్చినట్లుగా ఉంది. ఎవరు హత్య చేసి ఉంటారన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పారయ్య కొన్నాళ్ల క్రితం ఆంధ్ర నుంచి వలస వచ్చి రామనగుడలో ఉంటూ కొండపై వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ: గంజాయి అక్రమ రవాణా, సాగుపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీస్ యంత్రాంగం ఆ దిశగా దాడులను మరింత విస్తృతం చేసింది. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పద్మపూర్ పరిసర అటవీ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఈ దాడుల్లో భాగంగా బుధవారం నిధిగుడి అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగవుతున్న గంజాయిని ధ్వంసం చేశారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో గల 3 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సంస్కృతం, ఒరియా సబ్జెక్టుల్లో బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు బుధవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ తో పాటు పీహెచ్‌డీ, నెట్/స్లెట్, ఏపీసెట్ అర్హత గల అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. బోధన నైపుణ్యం, మౌఖిక పరీక్ష, ఉన్నత విద్యార్హతల వెయిటేజీ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. బయోడేటా, విద్యార్హతలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రంలోగా కళాశాలలో సమర్పించాలన్నారు. 10వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఘనంగా 'కుమార్ పౌర్ణమి ఉత్సవం'



మాట్లాడుతున్న తనూజ శతపతి

పర్లాకిమిడి: ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక యుటెక్ కంప్యూటర్ కార్యాలయం ఆవరణలో 'కుమార్ పౌర్ణమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మన ప్రాచీన సంప్రదాయలు, పండగలు నిర్వహించాలని ప్రగతి మహిళా సంస్థ కార్యదర్శి తనూజా శతపతి అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ ముర్ము విచ్చేయగా, విశిష్ట అతిథిగా కామాక్షి ప్రసాద్ పతి, ముఖ్యవక్తగా భాగవత్ పాడీలు హాజరయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కుమార పౌర్ణమి ఉత్సవంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు హరి మోహన్ పట్నాయక్, భగీరథీ పండా, డాక్టర్ ముర్ములు బహుమతులు అందజేశారు.

రహదారి నిర్మించాలి



కలెక్టరేట్‌కు వచ్చిన ఎస్.కోరడాసింగి, రుపాసాయి, కురుగుడ గ్రామస్తులు

పర్లాకిమిడి: గత పదేళ్లుగా ఎస్.కోరడాసింగి పంచాయతీ కురుగుడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాలు లభించటం లేదని నిరసిస్తూ జిల్లా అదనపు మాజిస్ట్రేట్ ఫల్గుణి మఝికి కోరడాసింగి సర్పంచ్ ప్రఫుల్ల ప్రధాన్ వినతిపత్రాన్ని అందజేశారు. గజపతి జిల్లాలో రాయఘడ బ్లాక్ ఎస్.కోరడాసింగి పంచాయతీ కురుగుడ నుంచి రంగడకు కిలో మీటరు రోడ్డు వేయాలన్నారు. అనేకసార్లు జిల్లా గ్రామీణ రోడ్డు నిర్మాణ డివిజన్‌కు విన్నపాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. అందువల్ల కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేయడానికి వచ్చామన్నారు. కురుగుడ నుంచి



మాట్లాడుతున్న కురుగుడ గ్రామవాసి రాజు శోబోరో

రంగడా గ్రామానికి రోడ్డు వేయకుంటే వచ్చే పంచాయతీ ఎన్నికలు బహిష్కరిస్తామని రాజు శోబోరో అన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి



గ్రామీణ రోడ్లు నిర్మాణ డివిజన్ వద్ద కరణ్ సాయి గ్రామస్తులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌లో కరణ్ సాయి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేనందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. కరణ్ సాయి గ్రామంలో గర్భిణులు రాయఘడ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నా, పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి రావాలన్నా డోలీల సహాయంతో ఐదు కిలో మీటర్లు నడిచి రావాల్సిందే. రాయఘడ బ్లాక్ నుంచి కరణ్ సాయి గ్రామానికి సుమారు ఐదు కిలో మీటర్ల మేర ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రోడ్డు నిర్మించాలని జిల్లా గ్రామీణ రోడ్లు నిర్మాణ శాఖ (ఆర్.డి. డివిజన్) అధికారికి వినతిని అందజేయడానికి గ్రామస్తులు విచ్చేశారు. ఆర్.డి.ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఏ.డి.ఎం ఫల్గుణి మఝికి వినతిపత్రాన్ని అందజేశారు.



రాళ్లుతేలిన రాయఘడ బ్లాక్ నుంచి కరణ్ సాయి రోడ్డు

నాడు కాదని..
నేడు అదే పని!

శ్రీకాకుళం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రకటనలకు చేపడుతున్న పనులకు పొంతన లేకుండా పోతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో కొందరు టీచర్లకు రాష్ట్రస్థాయిలో బదిలీలను చేశారు. అయితే విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో వీరిని రిలీవ్ చేయలేదు. అప్పట్లో నారా లోకేష్ రాష్ట్రస్థాయి బదిలీలపై విమర్శలు గుప్పించారు. అధికారంలోకి రాగానే ఆ బదిలీలను రద్దు చేశారు. ఇప్పు డు తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో బదిలీలు చేయడం గమనార్హం. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటి వరకు ఓ ఉపాధ్యాయులికి ఇలా బదిలీ జరిగింది. ఈమె భర్త ఓ ప్రజా ప్రతినిధి వద్ద పీఏగా పని చేస్తున్నట్లు సమాచా రం. పైగా దీన్ని రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది. బదిలీల ఉత్తర్వులు సహజంగా మెయిల్స్ ద్వారా విద్యా శాఖకు వస్తుంటాయి. ఈసారి మాత్రం బదిలీల ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ అధికారుల వాట్సాప్‌కు పంపడాన్ని ఉపా ధ్యాయ వర్గాలు తప్పుపడుతున్నాయి.

ఆకాశ దీపం వెలిగింది

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయంపైన బుధవారం ఆకాశ దీపం వెలిగించారు. ఒడిశా సంప్రదాయం ప్రకారం ఆశ్వయుజ మాసం పౌర్ణమి అనంతరం బహుళ పాడ్యమి నుంచి కార్తీక పౌర్ణమి వరకూ ఇలా ప్రతి రోజూ అర్చకులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాన్ని వెలిగిస్తారు. పాడ్యమి నుంచి కార్తీక పౌర్ణమి వరకూ ఒడిశా నుంచి భక్తుల తాకిడి ఉంటుందని అర్చకులు తెలిపారు. అలాగే ఒడిశా వాసులు గౌరీపౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకూ కార్తీక మాసంగా పాటిస్తారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు అయిన నిందితుడు అజిత్ బెనియా



నిందితుని నుంచి స్వాధీనపరచుకున్న టైర్లు

జయపురం: జయపురం హటపోదర్‌లోని టైర్ల దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లాష్ చంద్ర రౌత్ బుధవారం వెల్లడించారు. అరెస్టు అయిన నిందితుడు జయపురం పోలీసు స్టేషన్ పరిధి డొంగాగుడ బాబు సునారి కాలనీ వాసి అజిత్ బెనియా (19) అని తెలిపారు. అతని నుంచి పికప్ వ్యాన్ కొత్త టైర్లు 9, మోటారు బైక్ టైర్లు 11, ఒక లెనోవో ల్యాప్‌టాప్‌లు స్వాధీనపరచుకున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ రాత్రి జయపురం హటొపాదర్‌లో గల ఒక టైర్ల షోరూమ్‌లో దొంగతనం జరిగింది. రూ.15 వేలు, 50కి పైగా టైర్లు, ల్యాప్‌టాప్ దొంగతనం జరిగిందన్నారు. షోరూమ్‌లో గల సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. దర్యాప్తులో నిందితుని ఆచూకీ కనిపెట్టి అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ల్యాప్‌టాప్‌ను యజమానికి అందజేసినట్ల పోలీసు అధికారి వెల్లడించారు.



టైర్ల షోరూమ్ యజమానికి లాప్‌టాప్ అందజేస్తున్న పోలీసు అధికారి

సువర్ణభూషిత కూర్మనాథుడు

- దశాబ్దాల తర్వాత కూర్మనాథునికి ఆభరణాల అలంకరింపు
- 80 ఏళ్లుగా సింహాచలం దేవస్థానంలో భద్రపరిచిన వైనం

గార: ఎనభై ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కూర్మనాథుని సువర్ణ ఆభరణాలు మళ్లీ స్వామి విగ్రహాన్ని అలంకరించాయి. ఎనిమిది దశాబ్దాల పాటు సింహాచలంలోనే ఉండిపోయిన ఆభరణాలు మళ్లీ ఇన్నాళ్లకు అవి శ్రీకూర్మం చేరాయి. శ్రీకూర్మనాథుని ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి, గోవిందరాజ స్వామి, శ్రీరామ, లక్ష్మణస్వామి, సీతమ్మ వార్లకు బంగారు ఆభరణాలను బుధవారం అలంకరించారు. సుమారు 3 కిలోల బంగారం కలిగిన ఆభరణాల్లో గోవిందరాజస్వామి, శ్రీరామ, లక్ష్మణ విగ్రహాలకు వక్ష స్థలం, కవచాలు, కంటెలు, భుజకీర్తులు వంటివి ఉండగా, అమ్మవార్ల విగ్రహాలకు కిరీటాలతో పాటు మెడలో వేసుకున్న శేరులు వంటివి ఉన్నాయి.

80 ఏళ్ల కిందట ఆభరణాలకు ఆలయంలో రక్షణం కల్పించలేమని అప్పటి అధికారుల అభ్యర్థనతో సింహాచలం దేవస్థానంలో భద్రపరిచారు. అప్పటి నుంచి శ్రీకూర్మనాథాలయంలో జరిగే ప్రధాన ఉత్సవాలైన డోలోత్సవం, కల్యాణోత్సవం, శ్రీకూర్మనాథుని జయంత్యుత్సవాలకు సైతం వీటిని తీసుకురాలేదు. ఆలయంలో పనిచేస్తున్న వైదిక సిబ్బంది, అధికారులు చాలా మంది వీటిని ఇప్పటివరకు చూడలేదు. దేవస్థానం ధర్మకర్త పూసపాటి అశోకగజపతిరాజు గోవా గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోవడానికి ముందు ఆలయానికి వచ్చి దీనిపై లేఖ రాస్తానని చెప్పారు. గురువారం ఉదయం భద్రత నడుమ తీసుకువచ్చి గర్భగుడి సమీపంలోని అద్దాల మంటపంలోని స్వామి ఉత్సవ మూర్తులకు అలకరింపజేసి భక్తుల దర్శనార్థం ఉంచారు.



శ్రీకూర్మనాథుని మూర్తులకు అలంకరించిన బంగారు ఆభరణాలు

క్వారీల్లో మృత్యుఘోష



- క్వారీల్లో నిరంతరం చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు
- కానరాని భద్రతా చర్యలు

టెక్కలి: ఉపాధి కల్పించాల్సిన క్వారీలు కార్మికుల పాలిట మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. ఉదయం వాహనాల్లో కిక్కిరిసి క్వారీలకు వెళ్లింది మొదలు...తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే వరకు కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోంది. ఈ ఏడాది మే నెలలో మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపంలో దబ్బగూడ కొండపై మానీష్ కూనపు రెడ్డి గ్రానైట్ క్వారీలో జరిగిన పేలుడు సంఘటనలో ముగ్గురు కార్మికులు చనిపోయారు. మొదట పిడుగుపాటు అని చెప్పినా.. ఆ తర్వాత బ్లాస్టింగ్‌ల వల్లే చనిపోయారని తెలిసింది. రెండు రోజుల కిందట ఇదే మెళియాపుట్టి మండలం గంగరాజపురం సమీపంలో రాజయోగి క్వారీలో జరిగిన సంఘటనలో ముగ్గురు కార్మికులు మృత్యువాత పడగా మరో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గతంలోనూ టెక్కలి మండలంలో ఓ గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ మృత్యువాత పడ్డాడు. గత ఏడాది మరో క్వారీలో గ్రానైట్ బ్లాక్‌ను డ్రిల్ చేస్తుండగా జరిగిన సంఘటనలో తాపీమేస్త్రి చనిపోయాడు. మరో క్వారీలో ఎయిర్ కంప్రెషర్ పేలి బీహార్‌కు చెందిన కార్మికుడు కన్నుమూశాడు. ఎప్పటికప్పుడు ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా భద్రతా చర్యలు పెంచడం గానీ, అధికారులు దృష్టి సారించడం గానీ జరగలేదు. దీంతో ప్రమాదాలు కొనసాగుతున్నాయి. ఏటా జిల్లాలో గల గ్రానైట్ క్వారీల్లో జరుగుతున్న సంఘటనలతో స్థానిక కార్మికులతో పాటు ఒడిశా, బీహార్, రాజస్థాన్, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన వలస కార్మికులు మృత్యువాత పడుతున్నారు.

భద్రత ఉందా..?



గ్రానైట్ క్వారీ నిర్వహణలో ముఖ్యంగా హెల్మెట్లు, సేఫ్టీ షూస్, గ్లోవ్స్, సేఫ్టీ గాగుల్స్ లాంటి వ్యక్తిగత రక్షణ పరికరాలు అందించడం తప్పనిసరి. క్వారీ పని ప్రాంతాలకు భద్రతా గేట్లు ఉండాలి. భద్రతా సిగ్నల్స్, హెచ్చరికలతో సరైన హెచ్చరిక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. సురక్షిత విధానాలు పాటించడం, వాటిపై కార్మికులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించడం, మిషన్లకు తగిన రక్షణ కవచాలు ఏర్పాటు చేసి, సరైన నిర్వహణ జరపాలి. ప్రమాద నిరోధక బోర్డులను ఏర్పాటు చేసి విపత్తుల నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. పని ప్రదేశంలో పూర్తిగా సీసీ పర్యవేక్షణ, యాజమాన్యం పర్యవేక్షణ వ్యవస్థ కలిగి ఉండాలి. ముఖ్యంగా మైన్స్ మేనేజర్ పర్యవేక్షణ ఉండాలి. కానీ జిల్లాలోని క్వారీల్లో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్వారీల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకే దగ్గరుండి అవగాహన కల్పించాలి. కానీ ఈ కార్యక్రమాలు ఎప్పుడు నిర్వహిస్తున్నారో వారికే తెలియాలి.

వలస చట్టం ఉంది తెలుసా..?



ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రంలో గల పరిశ్రమలు, క్వారీల్లో పనిచేసేందుకు వలస వస్తున్న కార్మికుల కోసం ఇంటర్ స్టేట్ మైగ్రేట్ వర్క్‌మెన్ 1979 చట్టాన్ని రూపకల్పన చేశారు. ఈ చట్టం ద్వారా ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి, వసతి, వైద్యం కల్పించాలి. పని ప్రదేశాల్లో మరణిస్తే ఆయా యాజమాన్యాలు పూర్తి స్థాయిలో వారికి అండగా నిలిచి నష్ట పరిహారాన్ని అందజేయాలి. అంతే కాకుండా కార్మిక శాఖాధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్మికుల సంక్షేమానికి అండగా ఉండాలి. ప్రమాదాల తర్వాత ఆయా కుటుంబాలకు అండగా నిలిచి వారి పిల్లల చదువుల విషయంలో యాజమాన్యాలు సాయం చేయాలి. కానీ ఈ చట్టంపై కార్మికులకు అవగాహనే లేదు.

క్షతగాత్రులకు పరామర్శ

టెక్కలి: మెళియాపుట్టి మండలం గంగరాజపురం సమీపంలో రాజ్‌యోగి గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తదితరులు పరామర్శించారు. సంఘటన వివరాలను క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్యం అందజేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ భరోసా ఇచ్చారు.



క్షతగాత్రులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

క్వారీ సంఘటనపై ఎస్పీ ఆరా

మెళియాపుట్టి: గంగరాజపురం గ్రామంలోని రాజయోగ క్వారీలో మంగళవారం పిడుగు పడిన ప్రదేశాన్ని ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. ప్రమాదం ఎలా చోటుచేసుకుంది అనే కోణంలో దర్యాప్తు నిర్వహించాలని స్థానిక పోలీసులకు ఆదేశించినట్లు తెలుస్తోంది. పిడుగుల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.



పిడుగు పాటు సంభవించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



సారవకోట మండలం అవలింగి సమీపంలోని దుర్గా వైన్ షాపులో, సమీపంలోని ఇంట్లో సెప్టెంబర్ 2వ తేదీన నకిలీ మద్యం దొరికింది. మందుబాబుల ప్రాణాలు తీసే మద్యంగా అనుమానాలు ఉన్నాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చిన ఆల్కహాల్‌కు కలర్ కలిపి నకిలీ మద్యం తయారు చేసి, బాటిలింగ్ చేసి విక్రయిస్తున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి. దానికోసమే ఏకంగా ఇళ్లు అద్దెకు తీసుకుని, ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఆ ఇంట్లో వేలల్లో ఖాళీ సీసాలు, నకిలీ మూతలు, బ్యాచ్ నంబర్ స్టాంపింగ్ మిషన్ వంటివి దొరికాయి.



అంతకుముందు టెక్కలి ఆర్టీసీ డిపో సమీపంలో ఓ మద్యం దుకాణంలో కొన్న సీసా సీల్‌లో తేడా ఉండటాన్ని గుర్తించారు. మూతతీసి చూసి మద్యం కల్తీ అయిందని గుర్తించారు. రెగ్యులర్‌గా అదే బ్రాండ్ తాగే వ్యక్తికి తేడా తెలియడంతో కల్తీ అయిందని గోల పెట్టారు.


అదే టెక్కలిలో 55 ఏళ్ల వయసు గల వ్యక్తి ఓ వైన్‌షాపులో మద్యం బాటిల్ తీసుకుంటే మూత లూజ్‌గా ఉండటం గమనించారు. ఇదేంటి లూజుగా ఉందని ఆ వ్యక్తి నిలదీస్తే షాపులో ఉన్న వారు ఎక్కువ వాగకు అంటూ మెడపెట్టి తోసేశారు. దీంతో ఆ వ్యక్తి కింద పడిపోయి కన్నీటి పర్యంతమయ్యారు.

జిల్లాకూ నకిలీ మకిలి



- ఒడిశా సరిహద్దు నియోజకవర్గాల్లో నకిలీ మద్యం తయారీ
- సారవకోట మండలం అలవంగిలో బయటపడిన నకిలీ మద్యం బాగోతం
- నకిలీ మద్యం కేసులో పరారీలో టీడీపీ నాయకుడు నీలకంఠం
- టెక్కలిలో బయటపడ్డ రెండు మూడు పరిణామాలు
- టీడీపీ నాయకుల చేతుల్లోనే సిండికేట్
- నకిలీ, కల్తీ మద్యమంతా బెల్ట్‌షాపులకే వెళ్తున్న వైనం

బెల్టుషాపులకే కల్తీ మద్యం..



జిల్లాలో తయారవుతున్న కల్తీ మద్యం బాటిల్స్ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్‌షాపులకే వెళ్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సిండికేట్ నడుస్తోంది. ఒకవైపు కౌంటర్‌లో ఎమ్మార్పీకి మించి విక్రయాలు చేపడుతుండగా, మరోవైపు పర్మిట్, బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తోంది. సిండికేట్ అంతా టీడీపీ నాయకుల చేతుల్లోనే ఉంది. వారు ఏం చెబితే అదే జరుగుతోంది. ఫలితంగా బెల్ట్‌షాపుల్లో తనిఖీలు, పట్టుకోవడాలు జరగడం లేదు. ముడుపులు నడుస్తుండటంతో అంతా గుట్టుగా సాగిపోతోంది. రాజకీ య విభేదాలు తలెత్తితేనే గుట్టు బయటపడుతోంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రాష్ట్రాన్ని కుదిపేస్తున్న నకిలీ మద్యం ఆనవాళ్లు జిల్లాలోనూ కనిపించాయి. నిజానికి రాష్ట్రంలోని మిగతా చోట కంటే ముందే శ్రీకాకుళం జిల్లాలో ఈ బాగోతం బయటపడింది. ఇందులో టీడీపీ నాయకుడు మీసాల నీలకంఠం పాత్ర ఉన్నట్టు తేలింది. ఇప్పుడాయన ముందస్తు బెయిల్ కోసం యత్నిస్తున్నారు. ఒడిశాకు ఆనుకుని ఉన్న టెక్కలి, ఉద్దానం వంటి ప్రాంతాల్లో చీప్ లిక్కర్‌కు ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్(స్పిరిట్), కెరామల్ వంటి రసాయనాలు కలిపి ఏకంగా బాటిల్స్ తయారు చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఆంధ్రాలోని ఖరీదైన వైన్‌లో కూడా చీప్ లిక్కర్, వాటర్ మిక్సింగ్ చేసి బాటిల్స్ తయారు చేస్తున్నారు.

ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో కల్తీ మద్యం దందా నడుస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాలకు పడవలపై ఒడిశా నుంచి చీప్ లిక్కర్, సారా వస్తోంది. అక్కడి నుంచి వచ్చిన లిక్కర్‌ను జిల్లాలోని రహస్య ప్రాంతాలకు తరలించి బ్రాండ్ మిక్సింగ్ చేస్తున్నట్టుగా సమాచారం. దానికోసం ప్రత్యేకంగా ఖాళీ సీసాలు, నకిలీ మూతలు, బ్యాచ్ నంబర్ స్టాంపింగ్ మిషన్లను అక్రమార్కులు సమకూర్చుకున్నారు. సారవకోట మండలం అవలంగిలో ఇప్పటికే ఇవన్నీ దొరికాయి. రాజకీయ విభేదాల కారణంగా అక్కడ గుట్టు రట్టయ్యింది. లేదంటే గుట్టు చప్పుడుగా సాగిపోయేదే. మిగతా ప్రాంతాల్లోనూ ఈ రకమైన డెన్‌లు నడుస్తున్నట్టు తెలుస్తోంది.

గుర్తించలేనంతగా..

జిల్లాలో నిపుణుల చేత కల్తీ చేయిస్తూ అసలేదో, కల్తీ ఏదో గుర్తించలేనంతగా మందుబాబులను మోసం చేస్తున్నారు. ఈ కల్తీ చాలా చోట్ల అనుభవం ఉన్న నౌకర్ నామాలే చేస్తున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అందుకనే దాదాపు వైన్ షాపుల నిర్వాహకులు అనుభవం ఉన్న నౌకర్ నామాలను పెట్టుకుంటారు. దీనికి తోడు పర్మిట్ రూమ్‌లకు కూడా అనుమతి ఇవ్వడంతో కల్తీ మరింత సులభం అవుతోంది. లూజు అమ్మకాలు జరుగుతుండటంతో అక్కడికక్కడే బ్రాండ్ మిక్సింగ్ చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి.



టీడీపీ నాయకుడు నీలకంఠం అద్దెకు తీసుకున్న ఇంట్లో దొరికిన ఖాళీ సీసాలు, మూతలు

కల్తీ మద్యంతోనే ప్రమాదం

ఒడిశాకు ఆనుకుని సరిహద్దు ప్రాంతాలు జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి తదితర నియోజకవర్గాలు ఒడిశాకు దగ్గరలో ఉన్నాయి. ఒడిశాలో ప్రస్తుతం చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ ధర రూ.70నుంచి రూ.150వరకు ఉంది. అదే ఆంధ్రప్రదేశ్‌లోనైతే రూ. 99నుంచి రూ.220వరకు ఉంది. ఇక్కడ కంటే ఒడిశా చీప్ లిక్కర్ క్వాలిటీ బాగుంటుందంటారు. అందుకనే అక్కడి చీప్ లిక్కర్ తీసుకొచ్చి మన రాష్ట్రానికి చెందిన చీప్ లిక్కర్‌లో స్పిరిట్ మిక్సింగ్ చేసి బాటిల్స్ తయారు చేస్తున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా ఒడిశాలో సారా లీటర్ రూ.60నుంచి రూ.110వరకు దొరుకుతుంది. దాన్ని కూడా దిగుమతి చేసుకుని స్పిరిట్, కెరామల్ మిక్స్ చేసి చీప్ లిక్కర్‌గా తయారు చేస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. ఇదైతే అంతకంతకు లాభం ఉంటుంది. ఇది దాదాపు ప్రాణాలు తీసే మద్యమే అనుకోవాలి.

ఒడిశా నుంచి ముడి సరుకు..

ఒడిశాలోని బరంపురం, పర్లాకిమిడి, రాయగడ, కొరాపుట్, సునాబెడ, చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కల్తీ మద్యం బాటిలింగ్ చేసేందుకు యంత్రాలు, మెటీరియల్ అన్నీ విక్రయిస్తున్నారు. అక్కడ చాలా వరకు అనధికారికంగా నడిచేవి ఉన్నాయి. అక్కడి నుంచి మన సరిహద్దు ప్రాంతాల మీదుగా, తీర ప్రాంతాలకు పడవల మీదుగా రవాణా చేస్తున్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా

గాంధీ విగ్రహాన్ని భద్రపరిచిన పాఠశాల సిబ్బంది



గాంధీ విగ్రహాన్ని గదిలో పెడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

గంట్యాడ: మండలంలోని చినమానాపురం గ్రామంలో గల ఎంపీపీ పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని నేలపై పడేశారన్న అంశంపై సాక్షిలో 'మహాత్మా మన్నించు'..! శీర్షికన కథనం వెలువడగా పాఠశాల సిబ్బంది స్పందించారు. ఈ మేరకు గాంధీజీ విగ్రహాన్ని నేలపై నుంచి తీసి గదిలో భద్రపరిచారు.

అంగన్‌వాడీల ఖాతాల్లో జీతాలు జమ


అంగన్‌వాడీల ఆకలికేకలు..!

సాక్షిలో వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలకు జీతాలు అందక అవస్థలు పడుతున్న అంశంపై ఈనెల 5వతేదిన అంగన్‌వాడీల ఆకలికేకలు..! శీర్షికన ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల బ్యాంకు ఖాతాల్లో గురువారం జీతాలు జమ చేశారు.

రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక



రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పీడీలు

రాజాం: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.పద్మావతి బుధవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న పూజిత అండర్-19 జట్టుకు, 9వ తరగతి చదువుతున్న యోషిని అండర్-17 జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో వారి ప్రతిభను గుర్తించి ఎంపిక చేశారన్నారు. వారి ఎంపికపట్ల వ్యాయామ ఉపాధ్యాయులు సంతోషి, త్రినాథరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఒకరోజు ఆర్టీసీ ఆదాయం రూ.6.44లక్షలు



జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: ఈనెల 7వతేదీన విజయనగరంలో జరిగిన పైడిమాంబ సిరిమాను ఉత్సవాలకు జిల్లా నుంచి వేసిన ప్రత్యేక బస్సుల ద్వారా ఒక్క రోజులో సుమారు రూ.6.44, 285 ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పార్వతీపురం డిపో నుంచి 11, పాలకొండ డిపో నుంచి 11, సాలూరు డిపో నుంచి 13 కలిపి మొత్తం 35 ప్రత్యేక బస్సులు పార్వతీపురం, విజయనగరం మధ్య ప్రయాణించాయన్నారు. అధిక సంఖ్యలో ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారని చెప్పారు. అలాగే ప్రయాణికులు వివాహాది శుభకార్యాలు, తీర్థయాత్రలకు ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు.

రైళ్లలో చోరీ నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసిన జీఆర్పీఎస్సై బాలాజీరావు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: రైలులో ప్రయాణం చేసే వారినే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం కొండతామరాపల్లికి చెందిన కోన గౌరీశంకర్(43) రైలు ప్రయాణికులే టార్గెట్‌గా దొంగతనాలు చేసేవాడు. ఆకస్మిక తనిఖీలు చేపడుతున్న జీఆర్పీ సిబ్బంది విజయనగరం రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న గౌరీశంకర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చిట్టా మొత్తం చెప్పాడు. దీనిపై విచారణ చేసిన జీఆర్పీ సిబ్బంది గౌరీశంకర్ నుంచి రూ.లక్ష నగదు, 40 గ్రాముల గోల్డ్,1 0వేల విలువ గల మొబైల్ ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వే కోర్టులో ప్రవేశ పెట్టినట్లు ఎస్సై బాలాజీరావు చెప్పారు.

ముందు-చూపు అవసరం

- కళ్లను పరిరక్షించుకోవాలి
- కంటిచూపు లేకపోతే జీవితం అంధకారమే
- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం



రోగిని పరీక్షిస్తున్న కంటి వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవ శరీరంలో అతి ముఖ్యమైనవి కళ్లు, కంటి చూపు కోల్పోతే జీవితం అంధకారమే. ప్రకృతి అందాలను సైతం చూడలేని పరిస్థితి. అందువల్ల నేత్రాల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా అనేకమంది కంటి సమస్యలతో బాధపడుతున్నారు. పిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకు వివిధ రకాల కంటి సమస్యల బారిన పడుతున్నారు. మొబైల్ ఫోన్లు అధికంగా చూడడం వల్ల చాలా మందికి దృష్టి లోపం సమస్య వస్తోంది. ప్రపంచంలో ప్రతి ఒక సెకెనుకు ఒక వ్యక్తి దృష్టి కోల్పోతున్నాడు. వివిధ కారణాలతో ప్రతి ఒక నిమిషానికి ఒక చిన్నారి దృష్టి కోల్పోతున్నాడు. 2022వ సంవత్సరంలో నిర్వహించిన సర్వే ఆధారంగా భారత దేశంలో 49 లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారు. అదేవిధంగా 3.50కోట్ల మంది దృష్టి లోపంతో బాధపడుతున్నారు. వారిలో 80 శాతం మంది సకాలంలో నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా దృష్టి లోపాన్ని నివారించగలిగారు. ఒక వ్యక్తి అంధత్వం బారిన పడడం వల్ల తలసరి స్థూల జాతీయ ఆదాయం రూ.1,70, 624 నష్టం వాటిల్లుతుందని అంచనా వేస్తున్నారు.

కంటిసమస్యల పట్ల నిర్లక్ష్యం కూడదు

కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయకూడదు. చాలా మంది కంటి సమస్యలకు పసర మందులు, నాటు వైద్యులను ఆశ్రయిస్తుంటారు. దీని వల్ల చూపు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది. కంటి సమస్యలు వచ్చినప్పుడు దగ్గరలో ఉన్న కంటి వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అదేవిధంగా కంటి సమస్యలకు సొంత వైద్యం చేయకూడదు.

కంటి వెలుగు ద్వారా ఎంతో మందికి చూపు

కంటి ప్రాధాన్యతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఎంతో మందిని అంధత్వం బారిన పడకుండా సకాలంలో కంటి పరీక్షలు నిర్వహించి వారికి చూపును ప్రసాదించింది. కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి చేయించింది. అదేవిధంగా కంటి అద్దాలు అవసరమైన వారికి కంటి అద్దాలు కూడా అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంటి వెలుగు కార్యక్రమానికి మంగళం పాడేసింది.

2,92,462 మంది విద్యార్థులకు తొలివిడతలో పరీక్షలు

డా.వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా తొలివిడతలో 3357 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2,92,462 మంది విద్యార్థులకు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రెండోవిడతలో13,109 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 3844 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి కంటి అద్దాలు అందించారు. మెల్ల కన్ను శస్త్రచికిత్సలు 18 మందికి, కంటి శుక్లం శస్త్రచికిత్సలు ఐదుగురికి, రెప్పవాలడం శస్త్రచికిత్సలు 20 మందికి నిర్వహించారు. కంటివెలుగు మూడో విడతలో1, 79, 890 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 28, 213 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరం కాగా చేశారు. 43,938 మంది అవ్వాతాతలకు కళ్లజోళ్లు అందించారు.

కంటికి గాయాలైతే వైద్యుడిని సంప్రదించాలి



కంటి గాయాలైనప్పుడు వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. ప్రతి రోజూ ఆహారంలో ఆకుపచ్చని ఆకుకూరలు, కూరగాయలతో ఉన్న ఆహారం తీసుకోవాలి. పిల్లల్లో మెల్లకన్ను, కంటి రెప్ప వాలినట్లు ఉంటే కంటి వైద్యుడిని సంప్రదించాలి. అవసరం మేరకు మాత్రమే చిన్నారులకు టీవీ, మొబైల్, లాప్‌టాప్ వంటి ఎల్రక్టానిక్ పరికరాలు ఇవ్వాలి.

కె.త్రినాథరావు, జిల్లా అంధత్వ నివారణ శాఖ అధికారి

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్ల సత్తా

- సాఫ్ట్‌బాల్‌లో బాలురు, బాలికలకు ప్రథమస్థానం



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు



జిల్లా బాలుర జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలుర, బాలికల జట్లు సత్తా చాటాయి. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో జిల్లాకు చెందిన బాలుర, బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. అండర్-14 సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలు విశాఖపట్నం జిల్లా గొలుగుగొండ మండలం కృష్ణదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 4 నుంచి జరిగాయి. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన బాలురు, బాలికల జట్లు పాల్గొని మొదటి నుంచి మంచి ప్రతిభ కనబరచిన జిల్లా జట్లు ఫైనల్ పోటీలకు చేరాయి. ఫైనల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలురు జట్టు గుంటూరు జిల్లా జట్టుతో పోటీపడి విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే జిల్లాకు చెందిన బాలికల జట్టు చిత్తూరు జిల్లా జట్టుతో ఫైనల్ పోటీలో తలపడింది. ఈ పోటీల్లో విజయనగరం బాలికల జట్టు విజయం సాధించి ప్రథమస్థానాన్ని సొంతం చేసుకుంది. జిల్లాకు చెందిన రెండు జట్లు అత్యుత్తమ ఆటతీరును కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సంపాదించి వ్యక్తిగత గోల్డ్ మెడల్స్‌తోపాటు షీల్డ్‌లను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇరుజట్ల క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పీడీలు, పీఈటీలు, కోచ్‌లు అభినందించారు. రానున్న మరిన్ని పోటీల్లో బాగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామానికి సమీపంలో గల పెట్రోల్ బంకు దరి బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న బైక్‌ను విజయనగరం నుంచి జక్కువ వెళ్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన వ్యక్తి తనది ఎస్.కోట అని చెప్పి కోమాలోకి వెళ్లిపోవడంతో తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేష్ తెలియజేశారు. తీవ్ర గాయాలైన వ్యక్తిని జిల్లా కేంద్రంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

కారు ఢీకొని మరో వ్యక్తికి..

బొండపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. . పార్వతీపురం నుంచి బొండపల్లి మండలంలోని బి.రాజేరు గ్రామానికి పైల ఈశ్వర్రావు తన బైక్‌పై భార్య, ఇద్దరు కుమార్తెలతో వస్తుండగా విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న కారు ఢీకొనడంతో బైక్ నడుపుతున్న ఈశ్వరరావుకు గాయాలయ్యాయి. గాయపడిన ఈశ్వర్రావును గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

నదిలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహం వెలికితీస్తున్న గజ ఈతగాళ్లు

వంగర: మండల పరిధి రుషింగి వంతెన పై నుంచి నాగావళి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన కళ్లేపల్లి జగదీష్ మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈ నెల 7వ తేదీన గరుగుబిల్లి మండలం రావివలస వద్ద చేపల వ్యాపారం ముగించుకుని అదే మండలం మగ్గూరు గ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో భార్యాభర్తల మధ్య తగాదా రావడంతో జగదీష్ వంతెనపై నుంచి దూకేసిన విషయం పాఠకులకు విదితమే. స్థానిక హెచ్‌సీ దూసి రాములు ఆధ్వర్యంలో పోలీసులు, గజ ఈతగాళ్లు రుషింగి, తలగాం, శివ్వాం తదితర ప్రాంతాల వద్ద నాగావళి నదీతీరంలో గాలింపు చేపట్టారు. చివరికి వీరఘట్టం మండలం మొట్ట-వంగర మండలం సంగాం గ్రామాల సమీపంలో నాగావళి నదిలో మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలిస్తున్నట్లు హెచ్‌సీ దూసి రాములు తెలిపారు.

చెట్టు మీద పడి పోడు రైతు మృతి



రామారావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పార్వతీపురం రూరల్/కొమరాడ: కొమరాడ మండలంలో బుధవారం వ్యవసాయ పనులకు వెళ్తున్న ఓ రైతు మీద మామిడి చెట్టు పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గూడాతలేసు పంచాయతీ పరిధి తీలేసు గ్రామానికి చెందిన పువ్వుల రామారావు(47) కొండపోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. రోజులాగానే బుధవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో ఒక్కసారిగా పెనుగాలి వీయడంతో ఓ భారీ మామిడి చెట్టు రామారావుపై పడింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోగా గమనించిన స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, రామారావు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, డిగ్రీ పూర్తి చేసిన చిన్న కుమార్తె తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. రామారావు ఆకస్మిక మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జేసీబీతో ఇసుక అక్రమ తవ్వకాలు



అలజంగి కాలనీలో వేసిన ఇసుక

బొబ్బిలిరూరల్: ఇసుక తరలింపులో యథేచ్ఛగా అధికార పార్టీ నాయకులు చెలరేగిపోతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ అర్ధరాత్రిపూట ఇసుక దందా కొనసాగిస్తున్నారు.విషయం తెలిసినా అధికార పార్టీ నాయకులు కావడంతో అధినేత ఆగ్రహానికి గురికాకూడదని అధికారులు సైతం మౌనముద్ర వహిస్తున్నారు. దీంతో ఏకంగా నదిలో జేసీబీని వినియోగించి పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామం వద్ద వేగావతి నదిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు జేసీబీతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలించారు. దాదాపు 80 ఇసుక ట్రాక్టర్ల లోడ్ల ఇసుకను జేసీబీతో తవ్వి తీసి కొంతమేర పట్టణంలోని కాంట్రాక్టర్లకు అమ్ముకోగా మరికొన్ని ఇసుక లోడ్లు గ్రామంలోని కొత్తకాలనీలో రహదారిపై వేశారు. అడిగితే గ్రామంలోని రహదారులేకనని నమ్మించే ప్రయత్నం చేయగా గ్రామంలో కొంతమంది ప్రతిరోజూ అలజంగిలో జరుగుతున్న ఇసుక దందాపై ఇతరులకో నీతి,అధికార పార్టీనాయకులకో నీతి అంటూ చర్చించుకుంటున్నారు.

పరిశ్రమలకు రాత్రిపూట తరలింపు

ఇదిలా ఉండగా గ్రోత్‌సెంటర్‌లో ఫెర్రోపరిశ్రమలకు సైతం రాత్రి వేళల్లో ఇసుక అక్ర తరలింపు జరుగుతోంది. స్టాక్ పాయింట్ నుంచి తీసుకోవాల్సిన ఇసుకను ట్రాక్టర్ల యజమానులను సంప్రదించి పెంట వద్ద వేగావతి నది నుంచి రాత్రి 11 గంటలనుంచి తెల్లావార్లూ ఇసుక అక్రమరవాణా జరుగుతోందని, రోడ్లు కొట్టుకు పోతున్నాయని సాక్షాత్తు ఆయా గ్రామాల ప్రజలు తహసీల్దార్ ముందు వాపోయారు. అయినా అధినేత ఆంక్షలతో చూసీచూడనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు.

నా దృష్టికి రాలేదు

అలజంగి గ్రామంలోని వేగావతి నదిలో మంగళవారం రాత్రి ఇసుక తవ్వకాలపై తహసీల్దార్ ఎం.శ్రీను వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పుకొచ్చారు.

వీఎల్‌ఎస్‌ఐ కిట్‌ల విరాళం



జేఎన్‌టీయూ జీవీ ప్రొఫెసర్లకు వీఎల్‌ఎస్‌ఐ కిట్‌లు అందజేస్తున్న డ్రీమ్ చిప్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి, సింథటిక్ ప్రొఫెసర్ టెక్నాలజీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా అగ్రగామిగా ఉన్న డ్రీమ్ చిప్ ఎల్రక్టానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నాలుగు వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ కిట్లు విరాళంగా అందించింది. ఈ సందర్భంగా డ్రీమ్ చిప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి బులుసు గోపీకుమార్ బుధవారం మాట్లాడుతూ ఈ కిట్‌లు ఎఫ్‌పీజీఏ ఆధారిత చిప్ డిజైన్, పరిశీలన కార్యకలాపాలకు అవసరమైన సాంకేతిక మద్దతుతో రూపొందించినట్లు తెలిపారు. అలాగే ఎంబెడెడ్ ఏఐ చిప్ డిజైన్, కన్జ్యూమర్ టెక్నాలజీ చిప్ డిజైన్ ఇండస్ట్రియల్ కంట్రోల్ చిప్ డిజైన్, డ్రోన్ చిప్ డిజైన్, మెడికల్ టెక్ చిప్ డిజైన్, ఆటోమోటివ్ చిప్ డిజైన్, ఫిన్‌టెక్ చిప్ డిజైన్ వంటి అనేక పరిశ్రమల్లో ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. ఈ కిట్లకు డ్రీమ్ చిప్ ఎల్రక్టానిక్స్ సంస్థ నుంచి ఈ మెయిల్ సపోర్ట్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ కిట్లు తమిళనాడులోని చెన్నైలో రూపొందించబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం ఆంధ్ర మెడ్ టెక్ జోన్‌లో డ్రీమ్ చిప్ ఎల్రక్టానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో తయారుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రీమ్ చిప్ ఎల్రక్టానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి బులుసు మురళి, జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ బబులు, ఈసీ విభాగాధిపతి ప్రొఫెసర్ కేసీబీ రావు, ఇతర బోధకులు పాల్గొన్నారు.

ఇతర సమస్యలతో మరణాలు



డీఎంహెచ్‌ఓ డా.ఎస్.భాస్కరరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలో నిమ్మక సుమన్, నిమ్మక ప్రశాంత్‌లు పచ్చకామెర్ల వల్ల కాదని ఇతర సమస్యలతో మృతి చెందారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు జిల్లా నివాసి నిమ్మక సుమన్ (23) సెప్టెంబర్ 14వ తేదీన గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు గ్రామానికి వచ్చాడన్నారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు ఆయన గత నెల రోజులుగా నెల్లూరులో స్టోర్ కీపర్ గా పని చేస్తున్నాడని, సెప్టెంబర్ 30న ఒడిశా రాష్ట్రం లోని దుర్గపాడు జలపాతాన్ని సందర్శించి, అదే రోజు సాయంత్రం తిరిగి వచ్చాడన్నారు. అక్టోబర్ 4న జ్వరం, రెండు సార్లు విరేచనాలు, వాంతులు, పొత్తికడుపు నొప్పితో బాధపడుతూ ఉదయం 11 గంటలకు కురుపాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాగా వైద్యుడు పరిశీలించి అక్టోబర్ 5న మధ్యాహ్నం 12 గంటల సమయంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేయడంతో చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో చేర్చిన సమయానికి రోగి స్థిరంగా,చురుగ్గా ఉన్నాడని, దురదృష్టవశాత్తు అక్టోబర్ 6న అర్ధరాత్రి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఎన్సెఫలోపతి కారణంగా మరణించాడని చెప్పారు. అదే విధంగా నిమ్మక ప్రశాంత్ (31) జియ్యమ్మవలస మండలం చినదోడిజ గ్రామంలో అక్టోబర్ 5న తీవ్రమైన కడుపునొప్పితో సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకున్న అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. అయితే అప్పటికే దీర్ఘకాలంగా మద్యపానం అలవాటు వల్ల మల్టిపుల్ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కావడంతో మయోకార్డియల్ ఇన్ఫెక్షన్‌తో అక్టోబర్ 5 తేదీన రాత్రి మృతి చెందినట్లు వివరించారు. ఈ మరణాలు ఇతర సమస్యల కారణంగా జరిగినవే తప్ప , పచ్చకామెర్ల వల్ల కాదని స్పష్టం చేశారు.

సీజేఐపై దాడికి యత్నించడం సరికాదు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

విజయనగరం లీగల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్యగా స్థానిక న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కలిశెట్టి రవిబాబు అభివర్ణించారు. చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన సంఘటనకు నిరసనగా న్యాయవాదులు బుధవారం తమ విధులను బహిష్కరించారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ.. ఈ చర్యకు పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ చర్య న్యాయవ్యవస్థపై దాడిగా భావించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు నలితం సురేష్‌కుమార్, కొల్లంపూడి వెంకటరావు, సుశీల, భారతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిసీమకు దారేదీ?

- రహదారి సౌకర్యం లేని 226 గిరిజన గ్రామాలు
- బాహ్య ప్రపంచంతో తెగిపోయిన సంబంధం
- నిత్యం నరకం చూస్తున్న ప్రజానీకం
- వైద్యం అవసరమైతే డోలీలే అంబులెన్సులు





రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లో ఇటీవల సర్వే నిర్వహించిన సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది

పార్వతీపురం రూరల్: స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, ఆధునిక ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతున్నా, ఏజెన్సీ ప్రాంతంలోని అనేక గిరిజన గ్రామాలకు నేటికీ కనీస రహదారి సౌకర్యం కలగానే మిగిలిపోయింది. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఏకంగా 226 గ్రామాలకు సరైన దారి లేక అక్కడి ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. వాగులు, వంకలు, కొండలు, గుట్టలే వారికి శ్రీరామరక్షగా మారాయి. ప్రభుత్వ పాలకుల హామీలు నీటి మీద రాతల్లా మిగులుతున్నాయే తప్ప, వారి తలరాతలు మాత్రం మారడం లేదని గిరిజనం కన్నీటి పర్యంతమవుతోంది.

అడుగు బయటపెడితే అష్టకష్టాలు

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో రహదారుల దుస్థితికి అద్దం పట్టే గ్రామాలు కోకొల్లలు. ప్రధానంగా 63.30 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించాల్సి ఉన్నప్పటికీ, పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా, 52 గ్రామాలు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాయంటే, వాటికి కనీసం కాలిబాట కూడా లేకపోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. వర్షాకాలం వస్తే ఆ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. అత్యవసర వైద్యం అవసరమైతే డోలీలే వారికి అంబులెన్సులు. చదువుకోవాలన్నా, నిత్యావసరాలు తెచ్చుకోవాలన్నా, కిలోమీటర్ల కొద్దీ బురద, రాళ్ల మధ్య ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం చేయాల్సిందే.

గ్రామాల వారీగా గణాంకాలు

అధికారిక లెక్కల ప్రకారం, కురుపాం, మక్కువ, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు మండలాల పరిధిలో 25 గ్రామాలకు రోడ్లు లేవు. సాలూరు మండలంలోని గంజాయిభద్ర, నేరెళ్లవలస, కొదమ, సారిక వంటి పంచాయతీలలోని 14 గ్రామాలకు రహదారి నిర్మాణం అత్యవసరం. పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పార్వతీపురం వంటి అనేక మండలాల్లోని గిరిజన గ్రామాలది కూడా ఇదే దుస్థితి. ప్రతి ఏటా అధికారులు సర్వేలు చేయడం, ప్రతిపాదనలు పంపడం సాధారణ ప్రక్రియగా మారిందే తప్ప, ఆచరణలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నిధుల కొరతో, అటవీ అనుమతుల జాప్యమో కారణం ఏదైనా, శిక్ష అనుభవిస్తున్నది మాత్రం అమాయక గిరిజనులు. ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశాలతో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ దఫా అయినా పనులు చేస్తారా? లేదా ఎప్పటిలాగానే చేసిన సర్వే లెక్కలు కాగితాలకే పరిమితమవుతాయో వేచి చూడాల్సిన పరిస్థితి.

పాలకుల ప్రగల్భాలు..

సంక్షేమ రాజ్యమని, సుపరిపాలన అందిస్తున్నామని ఊదరగొట్టే పాలకుల మాటలకు, గిరిజన ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితికి మధ్య ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంది. అధికారం చేపట్టి ఏడాదిన్నర కాలం గడుస్తున్నా, జిల్లాలోని 226 ఆదివాసీ గ్రామాలకు కనీసం కాలిబాటను కూడా నిర్మించలేని ఈ ప్రభుత్వానికి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అంటూ గిరిజన సంఘాలు నిలదీస్తున్నాయి. గిరిజనుల బతుకులు కన్నీటి సుడుల్లో చిక్కుకుంటే, పాలకులు మాత్రం ప్రగల్భాలు పలుకుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడుతున్నారు.

గిరిజనుల గోడు పట్టదా?



ఎవరికైనా జ్వరం వచ్చినా, గర్భిణికి పురిటి నొప్పులొచ్చినా ప్రాణాల మీద ఆశ వదులుకుని డోలీలో ప్రయాణించాల్సిందే. వర్షాకాలం వస్తే మరింత దారుణమైన పరిస్థితి. గిరిజనులు పిల్లల చదువులు, అరకొర అందించే రేషన్ అన్నీ ఆగిపోతాయి. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చిన కుటమి నాయకులు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చూసే హామీలు అమలు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల కలక్టర్ ఆదేశంతో సర్వే చేసిన గిరిజన గ్రామాలకు తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాం.

– పాలక రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధన కార్యదర్శి